సాక్షి
కర్నూలు
శుక్రవారం, 23, ఫిబ్రవరి, 2024



.. ధైర్యం ప్రవహించె!

టీడీపీ హయాంలో ఎల్లెల్సీ ఆధునికీకరణ అటకెక్కింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన పనులతో కాలువలో నీటి లభ్యత పెరిగి రైతులు ధైర్యంగా పంటలు సాగు చేస్తున్నారు. IIలో▸



పాత్రలు విరాళం

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల దేవస్థానానికి హైదరాబాద్‌కు చెందిన బి. పర్వతయ్య, బిబిన్ డ్రగ్స్ అండ్ ఫార్మసిస్టికల్ లిమిటెడ్ వారు రూ. 3 లక్షల విలువ చేసే పాత్రలను అందజేశారు.



పార్వేట పల్లకీకి స్వాగతం

రుద్రవరం: అహోబిలేశుని పార్వేట పల్లకీ గురువారం ఆర్. నాగులవరానికి చేరుకుంది. గ్రామస్తులు మేళతాళలతో ఎదురేగి వెళ్లి పూజలు నిర్వహించి గ్రామంలోకి స్వాగతించారు.

సహకారం.. నూతనోత్సాహం

ప్రభుత్వ చర్యలతో వృద్ధిలోకి సహకార సంఘాలు

- టీడీపీ హయాంలో 90 సంఘాలకు నష్టాలు
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 70 సంఘాలకు స్పష్టమైన లాభాలు
- కామన్ సర్వీస్ సెంటర్లుగా పీఏసీఎస్‌ల అభివృద్ధి
- మల్టీపర్పస్ గోదాములు, కమ్యూనిటీ సెంటర్లు, షాపింగ్ కాంప్లెక్స్‌ల నిర్వహణ
- సహకార సంఘాల ఆధ్వర్యంలో పెట్రోల్ పంపులు
- ఆప్కాబ్, డీసీసీబీ చొరవతో మారిన రూపురేఖలు

కర్నూలు(అగ్రికల్చర్): ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల(పీఏసీఎస్) అభివృద్ధికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విశేష కృషి చేస్తోంది. ఐదేళ్ల క్రితం చూసిన సంఘాలను ఇప్పుడు చూస్తే ఇంతలా అభివృద్ధి చెందాయా అనుకోక తప్పదు. జిల్లా సహకార కేంద్ర బ్యాంకు అభివృద్ధి, ఇందులో సభ్యులుగా ఉన్న పీఏసీఎస్‌ల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోంది. నాడు నష్టాల్లో మునిగితేలుతున్న సహకార సంఘాలను లాభాల బాట పట్టించడం ద్వారా రైతులతో పాటు అన్ని వర్గాల ప్రజలకు సేవలు అందించే స్థాయికి చేర్చడం విశేషం. 2014–15 నుంచి 2018–19 వరకు అప్పటి టీడీపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడం వల్ల సహకార సంఘాలు ఉండీ లేనట్లుగా తయారయ్యాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆంధ్రప్రదేశ్ సహకార బ్యాంకు(ఆప్కాబ్), జిల్లా సహకార కేంద్ర బ్యాంకు సంయుక్తంగా సహకార సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసి లాభాల బాట పట్టించాయి. ఇందుకు నాబార్డు కూడా అన్నివిధాల సహకరిస్తోంది. గతంలో సహకార సంఘాలు కేవలం రైతులకు రుణాలు ఇవ్వడం, రికవరీ చేయడం వరకే పరిమితం. కానీ నేడు సహకార సంఘాల రూపురేఖలను ప్రభుత్వం సమూలంగా మార్చేస్తోంది.

ఫ్యాక్స్ డెవలప్‌మెంటు సెల్ ఏర్పాటు

ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉమ్మడి కర్నూలు జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో ప్యాక్స్ డెవలప్‌మెంట్ సెల్ ప్రత్యేకంగా ఏర్పాటైంది. దీనికి ఆప్కాబ్‌కు చెందిన అసిస్టెంట్ జనరల్ మేనేజర్ స్థాయి అధికారి ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. ఫ్యాక్స్ డెవలప్‌మెంటు సెల్ పీఏసీఎస్‌లకు ఏ వ్యాపారాల్లో అభిరుచి ఉందో తెలుసుకుంటుంది. అందుకు అవసరమైన ప్రతిపాదనలు తయారు చేసి ఆప్కాబ్‌కు, నాబార్డుకు పంపి నిధుల మంజూరుకు కృషి చేస్తోంది.

పూర్తి కావచ్చిన కంప్యూటరీకరణ

ఉమ్మడి కర్నూలు జిల్లాలో సహకార సంఘాల కంప్యూటరీకరణ ముమ్మరంగా సాగుతోంది. మొత్తం 99 సంఘాలు ఉండగా.. ఈ నెల చివరిలోపు కంప్యూటరీకరణ పూర్తి చేసి ఆన్‌లైన్‌లో లావాదేవీలను చేపట్టాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఉంది. కంప్యూటరీకరణ పూర్తయితే పీఏసీఎస్‌లు మినీ బ్యాంకులుగా మార్పు చెందనున్నాయి.



నంద్యాల జిల్లా పోలూరు పీఏసీఎస్ నూతన భవనం

1.54 లక్షల మెట్రిక్ టన్నుల గోదాములు

పీఏసీఎస్‌లకు అనుబంధంగా ఉమ్మడి కర్నూలు జిల్లాలో 232 మల్టీపర్పస్ గోదాములు నిర్మిస్తున్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న గోదాముల సామర్థ్యం 1.54 లక్షల మెట్రిక్ టన్నులు ఉండటం విశేషం. కర్నూలు జిల్లాలో దాదాపు రూ.60 కోట్ల వ్యయంతో 99 గోదాములు.. నంద్యాల జిల్లాలో రూ.80 కోట్లతో 133 గోదాములు నిర్మిస్తున్నారు. పూర్తి చేసిన గోదాములను మార్కెటింగ్ శాఖ పీఏసీఎస్‌లకు అప్పగిస్తోంది.



జన ఔషధి కేంద్రం

సహకార సంఘాల్లో జన ఔషధి కేంద్రాలు

ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో ప్రధానమంత్రి జన ఔషధి కేంద్రాలు ఏర్పాటవుతున్నాయి. మొదటి విడత సి.బెళగల్, హొళగుంద, ఓర్వకల్, కౌతాళం, పెద్దకడుబూరు, మద్దికెర, మదిర పీఏసీఎస్‌లతో పాటు జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ, నంద్యాల జిల్లాలో నందికొట్కూరు, దొర్నిపాడు మండలంలోని గుండుపాపల, నంద్యాల మండలంలోని పోలూరు, ఆళ్లగడ్డ, కొత్తపల్లి మండలంలోని నాగంపల్లి సహకార సంఘాల్లో జన ఔషధి కేంద్రాలు ఏర్పాటవుతున్నాయి. మరిన్ని సొసైటీలు జన ఔషధి కేంద్రాల ఏర్పాటుకు ముందుకొస్తున్నాయి.

సహకార సంఘాల్లో గత ఐదేళ్లలో జరిగిన అభివృద్ధి

జరిగిన అభివృద్ధి	సంఘాలు	నిధుల వినియోగం (రూ.కోట్లలో)
పెట్రోల్ బంకులు	2	1.19
షాపింగ్ కాంప్లెక్స్‌లు	8	1.41
కొత్త ఆఫీసు భవనాలు	11	1.65
ఫంక్షన్‌హాల్/కమ్యూనిటీ హాల్స్	2	1.23
గోదాముల పునరుద్ధరణ	7	1.36
పీవీసీ లింక్ పైప్స్ వ్యాపారం	1	0.19
రైస్ బ్యాగ్స్ వ్యాపారం	1	0.23
పర్సనల్ లోన్స్	6	3.60
గోల్డ్ లోన్స్	6	3.06
టార్పాలిన్ వ్యాపారం	1	0.18
టూ వీలర్ వెహికల్స్	5	2.03
గోనె సంచుల వ్యాపారం	5	0.36
ఇతర వ్యాపారాలు	2	0.02
మల్టీపర్పస్ గోదాములు	99	140.00
పీఎం జన ఔషధి కేంద్రాలు	16	---
మొత్తం		156.51



సహకార సంఘంలో ఏర్పాటైన పెట్రోల్ బంకు



సి.బెళగల్ పీఏసీఎస్ నూతన భవనం

నాడు..

14 ఏళ్ల సీఎంగా కొనసాగిన చంద్రబాబు తన పాలనలో సహకార రంగం అభివృద్ధికి కనీస చొరవ చూపలేకపోయారు. ఉమ్మడి జిల్లాలోని సహకార సంఘాలన్నీ దాదాపుగా నష్టాల ఊబిలో కూరుకుపోయాయి. ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికైన జిల్లా సహకార కేంద్ర బ్యాంకు చైర్‌పర్సన్ విషయంలోనూ వెన్నుపోటుకు పాల్పడ్డారు. అక్రమంగా ఆమెను తప్పించి అనుయాయులకు పట్టం కట్టడం ఆ పార్టీ నీచ సంస్కృతికి అద్దం పట్టింది.

నేడు..

వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వం నాడు–నేడు తరహాలో సహకార సంఘాల అభివృద్ధికి శ్రీకారం చుట్టడం విశేషం. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా అభివృద్ధిలో దూసుకెళ్తున్నాయి. ఆప్కాబ్, నాబార్డు, జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఆర్థిక సహకారంతో దాదాపు రూ.18 కోట్లతో సహకార సంఘాలు అభివృద్ధి బాట పట్టాయి. కంప్యూటరీకరణతో త్వరలోనే బ్యాంకు సేవలను కూడా అందించనుండటం మార్పునకు నిదర్శనం.

బహుళసేవా సంస్థలుగా పీఏసీఎస్‌లు

- 11 పీఏసీఎస్‌లకు నూతన భవనాలు నిర్మించారు.
- బంగారు ఆభరణాలు నిల్వ చేసుకునేందుకు వీలుగా స్ట్రాంగ్ రూములు.
- రెండు సహకార సంఘాలలో పెట్రోల్ బంకులు.
- పలు సంఘాలకు కమర్షియల్ షాపింగ్ కాంప్లెక్స్, కమ్యూనిటీ హాల్స్, వ్యవసాయ ఉత్పత్తుల నిల్వకు గోదాములు.
- ఆధునీకరణ, మరమ్మతులు, మొబైల్ రైస్ మిల్, లారీ వేబ్రిడ్జి ప్లాట్‌ఫామ్, టెంట్‌హౌస్, సూపర్ బజార్ల ఏర్పాటు.
- బంగారం ఆభరణాలపై రుణాలు.
- పీఏసీఎస్‌లు బ్యాంకింగ్ సేవలు అందించడంతో పాటు కామన్ సర్వీస్ సెంటర్లుగా కూడా అభివృద్ధి.

అభివృద్ధి పథంలో పీఏసీఎస్‌లు



ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు క్రమంగా లాభాల్లోకి వస్తున్నాయి. ఇప్పటి వరకు దాదాపు రూ.17 కోట్లతో సంఘాలను అభివృద్ధి చేశాం. రూ.140 కోట్లతో మల్టీపర్పస్ గోదాములు కూడా నిర్మిస్తున్నాం. సంఘాలు వ్యాపారాలను విస్తరించుకోవడం వల్ల లాభాల బాట పడుతున్నాయి. సొసైటీలను మల్టీపర్పస్ సెంటర్లుగా, కామన్ సర్వీస్ సెంటర్లుగా అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. – వహిదా సుల్తానా, మేనేజర్, జిల్లా ఫ్యాక్స్ డెవలప్‌మెంట్ సెల్

న్యూస్‌రీల్

ఎంసీఎంసీ చైర్మన్‌గా జిల్లా కలెక్టర్

కర్నూలు(సెంట్రల్): జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన చైర్మన్‌గా మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ(ఎంసీఎంసీ) ఏర్పాటైంది. ఈ కమిటీ మెంబర్ సెక్రటరీగా ఐఅండ్‌పీఆర్ డీడీ జయమ్మ ఎంపిక కాగా, సభ్యులుగా డీఆర్వో కె.మధుసూదనరావు, సీపీఓ హిమప్రభాకరరాజు, ఎస్ఐసీ డీఐఓ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ఆల్ ఇండియా రేడియో ప్రోగ్రామ్ ఎగ్జిక్యూటివ్ డి.మురళి, ది హాన్స్ ఇండియా స్టాఫ్ రిపోర్టర్ నరేంద్ర కుమార్ ఉన్నారు. ఈ కమిటీ ఎన్నికల సమయంలో అభ్యర్థులు రోజువారీగా చేసే ఖర్చులు, మీడియా, సోషల్ మీడియాల్లో వచ్చే రాజకీయ ప్రకటనలు, పెయిడ్ న్యూస్, సమస్యాత్మక ప్రసంగాలపై దృష్టి సారిస్తుంది. రాజకీయ పార్టీ, అభ్యర్థులు నిబంధనలను ఉల్లంఘిస్తే నోటీసులు జారీ చేసి, వివరణ అడుగుతుంది.

మద్దతు ధరతో శనగల కొనుగోలు

కర్నూలు(అగ్రికల్చర్): 2023–24 రబీ సీజన్‌లో పండించిన శనగలను మద్దతు ధరతో కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం అనుమతిచ్చింది. ఇందుకోసం మార్క్‌ఫెడ్‌ను నోడల్ ఏజెన్సీగా నియమించింది. జిల్లాలో 1.27 లక్షల ఎకరాల్లో శనగ సాగయింది. ఎకరాకు సగటున 2.8 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది. మద్దతు ధరతో శనగలను అమ్ముకోవడానికి ఒకటి, రెండు రోజుల్లో ఆర్‌బీకేల్లో రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం కల్పించనున్నారు. శనగ మద్దతు ధర రూ.5,440 కాగా.. బహిరంగమార్కెట్‌లో రూ.6,200 ధర పలుకుతుండటం గమనార్హం.

ఎస్సీ రైతులకు డ్రమ్ములు



డ్రమ్ములను పరిశీలిస్తున్న ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాసకుమార్

కర్నూలు(అర్బన్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న షెడ్యూల్డు కులాల రైతులకు ప్రభుత్వం డ్రమ్ములను సరఫరా చేస్తోందని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ఎస్.శ్రీనివాసకుమార్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కర్నూలు జిల్లాలో 1,648, నంద్యాల జిల్లాలో 1,812 మంది ఎస్సీ రైతులకు ఒక్కొక్కరికి రూ.10 వేలు విలువ చేసే 23 రకాల విత్తనాలు, ఒక టార్పాలిన్, 200 లీటర్ల డ్రమ్ము, 100 లీటర్ల డ్రమ్మును అందిస్తోందన్నారు. జొన్న, జీలుగ, మొక్కజొన్న, పిల్లి పెసర, జనుము, కొర్ర, రాగులు, సజ్జలు, వేరుశనగ, నూగులు, మినుములు, పెసలు, కందులు, ఉలవలు తదితర విత్తనాలను ఇప్పటికే ఉమ్మడి జిల్లాలోని అన్ని మండలాల్లో గుర్తించిన ఎస్సీ రైతులకు అందించామన్నారు. డ్రమ్ములు, టార్పాలిన్లను త్వరలోనే పంపిణీ చేస్తామన్నారు.

డీసీసీబీ నూతన సీఈఓగా విజయకుమార్

- వ్యక్తిగత సెలవుల్లో ప్రస్తుత సీఈఓ శివలీల

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు తాత్కాలిక ముఖ్య కార్యనిర్వహణాధికారిగా ఎం.విజయకుమార్‌ను నియమిస్తూ పాలక వర్గం ఉత్తర్వులు జారీ చేసింది. ఈయన ఆప్కాబ్‌లో డిప్యూటీ జనరల్ మేనేజర్ స్థాయి అధికారి. దాదాపు ఏడాదిన్నర నుంచి డీసీసీబీలో జనరల్ మేనేజర్/ ఓఎస్‌డీగా విధులు నిర్వహిస్తున్నారు. ఇదిలాఉంటే ఈ నెల 7న సీఈఓగా శివలీల బాధ్యతలు చేపట్టారు. అయితే వ్యక్తిగత పనులపై 45 రోజుల దీర్ఘకాలిక సెలవులో అమెరికా వెళ్తుండటంతో పాలక వర్గం అనుమతిచ్చింది. ఈ నేపథ్యంలో ఆప్కాబ్ డీజీఎం విజయకుమార్‌కు సీఈఓ బాధ్యతలు అప్పగించారు. శివలీల శుక్రవారం రిలీవ్ అయ్యే అవకాశం ఉండగా.. ఆ వెంటనే విజయకుమార్ బాధ్యతలు స్వీకరించనున్నట్లు తెలుస్తోంది.

నలుగురిపై సస్పెన్షన్ ఎత్తివేత

కర్నూలు (టౌన్): వైఎస్సార్, నంద్యాల జిల్లాలకు చెందిన నలుగురు పోలీసు సిబ్బందిపై ఉన్న సస్పెండ్‌ను ఎత్తివేస్తూ కర్నూలు రేంజ్ డీఐజీ విజయరావు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. కడపకు చెందిన ఇన్‌స్పెక్టర్ పి.శేషయ్య, నంద్యాలకు చెందిన ఎస్‌ఐ బి.నాగరాజు, కడపకు చెందిన హెడ్ కానిస్టేబుల్ బి.బాలదస్తగిరి, ఆఫీసు సూపరింటెండెంట్ టి.ప్రశాంతిపై సస్పెండ్‌ను ఎత్తివేస్తూ విధుల్లోకి చేరాలని సూచించారు.

ఏసీబీ వలలో మార్కెట్ యార్డ్ సూపర్‌వైజర్

- రూ. 15 వేలు లంచం తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న అవినీతి నిరోధకశాఖ అధికారులు

ఎమ్మిగనూరు రూరల్: ట్రేడ్ లైసెన్స్ ఇచ్చేందుకు రూ. 15వేలు లంచం తీసుకుంటూ ఎమ్మిగనూరు వ్యవసాయ మార్కెట్ యార్డ్ సూపర్‌వైజర్ ఉమామహేశ్వరి గురువారం మధ్యాహ్నం ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా దొరికిపోయారు. ఏసీబీ డీఎస్పీ వెంకటాద్రి తెలిపిన వివరాల మేరకు.. వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో కూరగాయల విక్రయాలకు లైసెన్సు కోసం బోయ వినయ్‌కుమార్ అనే వ్యక్తి దరఖాస్తు చేసుకున్నాడు. లైసెన్సు ఇచ్చేందుకు రూ. 15 వేలను సూపర్‌వైజర్ ఉమామహేశ్వరి డిమాండ్ చేశారు. లంచం ఇవ్వటం ఇష్టం లేని వినయ్‌కుమార్ బుధవారం ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. పక్కా ప్రణాళిక ప్రకారం వ్యవసాయ మార్కెట్ యార్డ్ కార్యాలయంలో గురువారం మధ్యాహ్నం మార్కెట్ యార్డ్ సూపర్‌వైజర్ ఉమామహేశ్వరి రూ. 15 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నామని ఏసీబీ డీఎస్పీ వెంకటాద్రి తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు లంచం అడిగితే అవినీతి నిరోధకశాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతిని అంతమొందించటానికి రాష్ట్ర ప్రభుత్వం 14400 టోల్ ఫ్రీ నంబర్ అందుబాటులో ఉంచిందన్నారు. దాడుల్లో ఏసీబీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



సూపర్‌వైజర్ ఉమామహేశ్వరి, చిత్రంలో ఏసీబీ అధికారులు, పట్టుకున్న నగదు

డీఎస్సీ నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

- జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. సృజన

కర్నూలు(సెంట్రల్): ఉపాధ్యాయ నియామకాల కోసం డీఎస్సీ నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన తెలిపారు. గురువారం విజయవాడ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పది, ఇంటర్, టెట్, డీఎస్సీ పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్‌తో కలసి ఆ శాఖ మంత్రి బొత్ససత్యనారాయణ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయా పరీక్షల నిర్వహణకు తీసుకున్న చర్యలను జిల్లా కలెక్టర్ సృజన వివరించారు. డీఎస్సీతోపాటు టెట్, ఇంటర్, పదో తరగతి పరీక్షలు నిర్వహించే కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అంతకముందు విద్యాశాఖమంత్రి, ప్రిన్సిపల్ సెక్రటరీ మాట్లాడుతూ.. ప్రశాంత వాతావరణంలో పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు చేయాలన్నారు. పరీక్షల సమయంలో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్పీ జి.కృష్ణకాంత్, డీఈఓ శామ్యూల్, ఆర్‌ఐఓ గురవయ్యశెట్టి, డీవీఈఓ జమీర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

మార్చి 1 నుంచి 20 వరకు ఇంటర్ పరీక్షలు

కర్నూలు(సెంట్రల్): మార్చి 1 నుంచి 20వ తేదీ వరకు నిర్వహిస్తున్న ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పబ్లిక్ పరీక్షల నిర్వహణకు పడక్బందీ చర్యలు చేపట్టాలని డీఆర్వో కె.మధుసూదన్‌రావు అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్లోని కాన్ఫరెన్స్ హాలులో డీఆర్వో అధ్యక్షతన ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణపై జిల్లాస్థాయి సమన్వయ సమీక్ష సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 69 పరీక్షా కేంద్రాల్లో 47,412 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారన్నారు. ఇందులో మొదటి సంవత్సరం విద్యార్థులు 22,239 మంది.. రెండో సంవత్సరం విద్యార్థులు 25,173 మంది ఉన్నట్లు చెప్పారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు పరీక్షా సమయం ఉంటుందని, అయితే విద్యార్థులు 8.30 గంటలకే కేంద్రాలకు చేరుకోవాలన్నారు. ప్రశ్న పత్రాలను పరీక్షా కేంద్రాలకు తరలించేందుకు రవాణా శాఖాధికారులు అవసరమైన వాహలను సమకూర్చాలన్నారు. పరీక్షలు పూర్తయిన తరువాత సమాధాన పత్రాలను సీల్డ్ కవర్‌లో పోస్టల్ శాఖకు వెంటనే పంపాలన్నారు. పరీక్షా కేంద్రాలలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఏఎన్ఎంలను అందుబాటులో ఉంచాలని డీఎంహెచ్‌ఓను ఆదేశించారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షా కేంద్రాలకు సమీపంలోని జిరాక్స్ సెంటర్లు మూసివేయాలన్నారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద 144 సెక్షన్ విధించాలని పోలీసులను ఆదేశించారు. సమస్యాత్మక పరీక్షా కేంద్రాలైన పత్తికొండ, దేవనకొండ, కోసిగి, చిప్పగిరి, ఆలూరులలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, ఆర్‌ఐఓ గురవయ్యశెట్టి, డీవీఈఓ జమీర్‌బాషా, డీఈఓ శామ్యూల్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్వో కె.మధుసూదన్‌రావు

మేలు జరిగితేనే ఓటేయమన్న ఏకైక సీఎం జగన్

- మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి

బేతంచెర్ల: దేశ రాజకీయాల్లో ఇప్పటి వరకు మేలు జరిగితేనే తమ పార్టీకి ఓటేయమని ప్రజలను కోరిన ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి అన్నారు. ప్రతిపక్షాలు అన్ని ఏకమైనా ప్రజల ఆశీర్వాదంతో 2024 ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్‌సీపీ విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. గురువారం బేతంచెర్ల పట్టణానికి సమీపంలో కొలుములపల్లె రహదారిలో రూ.60 లక్షలతో మార్కెట్ యార్డ్ నిర్మాణానికి ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ కమిషనర్ రమేష్ బాబు, వైస్ చైర్మన్ నాగ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మంత్రి బుగ్గన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ సత్యదీప్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో మండలంలోని ముద్దవరం, ఎం.పెండేకల్లు, ఆర్ఎస్ రంగాపురం, కొలుములపల్లె, గూటుపల్లె, ఎంబాయి, ఆర్. కొత్తపల్లె, గోర్లగుట్ట, బేతంచెర్ల, బుగ్గానిపల్లె గ్రామాల రైతులకు ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి చేతుల మీదుగా భూ హక్కు పత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రూ. 351 కోట్లతో చేపట్టిన వాటర్ గ్రిడ్ పథకం కింద మొదటి విడతలో అనుకున్న విధంగా బేతంచెర్ల పట్టణానికి గోరుకల్లు రిజర్వాయర్ నుంచి ఈనెల 24వ తేదీన కృష్ణాజలాలు అందిస్తామన్నారు. బాబు ష్యూరిటీ.. భవిష్యత్తు గ్యారంటీ అంటూ ఊర్లు తిరుగుతున్న అబద్ధాల మాజీ సీఎం చంద్రబాబు నాయుడు నమ్మవద్దని ప్రజలకు హితవు పలికారు. తనపై విమర్శలు చేసే డోన్ టీడీపీ ఇన్‌చార్జ్ ధర్మవరం సుబ్బారెడ్డి ముందు టికెట్ వస్తుందో లేదో చూసుకోవాలని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ, మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్లు ముర్తుజావలి, ఖాజా, రాష్ట్ర గిడ్డంగుల శాఖ డైరెక్టర్ బాబుల్ రెడ్డి, వాల్మీకి ఫెడరేషన్ డైరెక్టర్ మురళీ కృష్ణ, వార్డు కౌన్సిలర్స్ మధు, శకుంతల, ఇబ్రహీమ్, మద్దిలేటి స్వామి ఆయల చైర్మన్ రామచంద్రుడు తదితరులు పాల్గొన్నారు.



భూ హక్కు పత్రాలను పంపిణీ చేస్తున్న బుగ్గన

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించండి

- అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన

కర్నూలు(సెంట్రల్): వారం రోజుల్లోపు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించాలని అధికారులను జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆదేశించారు. గురువారం జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ఆడిటోరియంలో సెక్టార్ అధికారులతో జిల్లా డాక్టర్ జి.సృజన, ఎస్పీ జి.కృష్ణకాంత్ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన తరువాత మూడు రోజులకు సమస్యాత్మక, వల్నరబిలిటీ పోలింగ్ కేంద్రాల మ్యాపింగ్ వివరాలను ఎన్నికల కమిషన్‌కు సమర్పించాల్సి ఉంటుందన్నారు. ఆయా ప్రక్రియలను వారం రోజుల్లోపూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. వల్నరబిలిటీ అంటే ఓటర్లు స్వతంత్రంగా ఓటు వేయకుండా ప్రభావితం చేసే అంశాలు ఏమైనా ఉండడమేనన్నారు. సమస్యాత్మకమంటే ఒక పోలింగ్ స్టేషన్‌లో 90 శాతం కంటే ఎక్కువ పోలింగ్ జరగడం, 10 శాతం కంటే తక్కువ పోలింగ్ నమోదు కావడం, శాంతిభద్రతల సమస్యలు, వ్యక్తులపై ఎఫ్ఐఆర్ నమోదు కావడం వంటి కారణాలను పరిగణనలోకి తీసుకోవాలన్నారు. ఇప్పటి వరకు సెక్టార్ అధికారులు పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు, పోలింగ్ కేంద్రాల రూట్ల వివరాలను మాత్రమే పరిశీలించాలని, రాబోయే రోజుల్లో వల్నరబిలిటీ, క్రిటికల్ కేర్ పోలింగ్ కేంద్రాలపై ఎక్కువ దృష్టి సారించాల్సి ఉంటుందన్నారు. రౌడీ షీటర్లు ఉంటే బైండోవర్ చేసి ఎన్నికలు జరిగే వరకు పోలీసు స్టేషన్‌లో ఉంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్పీ కృష్ణకాంత్ మాట్లాడుతూ..సెక్టార్ అధికారులు, సెక్టార్ పోలీసులు సమన్వయంతో ఎన్నికల విధులు నిర్వర్తించాలన్నారు. కార్యక్రమంలో జేసీ నారపురెడ్డి మౌర్య, డీఆర్వో కె.మధుసూదన్‌రావు, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, హెచ్ఎన్ఎస్ఎస్ యూనిట్ 3 స్పెషల్ కలెక్టర్ మురళి, యూనిట్4 ఎస్‌డీసీ రాముసాయక్, పత్తికొండ ఆర్‌డీఓ రామలక్ష్మి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ జి.సృజన

వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ పరిశీలకుల నియామకం

కర్నూలు: ఉమ్మడి కర్నూలు జిల్లాలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలకు వైఎస్సార్‌సీపీ పరిశీలకులను పార్టీ అధిష్టానం నియమించింది. ఈమేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది. పాణ్యం నియోజకవర్గానికి మార్క్‌ఫెడ్ రాష్ట్ర చైర్మన్ పీపీ నాగిరెడ్డిని నియమించింది. కర్నూలు నియోజకవర్గానికి కోగటం విజయభాస్కర్ రెడ్డి, ఆలూరు నియోజకవర్గానికి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి తెర్నేకల్ సురేంద్ర రెడ్డి, ఎమ్మిగనూరుకు ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్‌ను పరిశీలకులుగా వ్యవహరించనున్నారు. శ్రీశైలం నియోజకవర్గానికి మైనార్టీ శాఖ రాష్ట్ర సలహాదారు హబీబుల్లా, బనగానపల్లె నియోజకవర్గానికి చాగలమర్రికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత షేక్‌బాబూలాల్‌ను పరిశీలకులుగా పార్టీ అధిష్టానం నియమించింది. త్వరలో జరగనున్న సాధారణ ఎన్నికల నేపథ్యంలో ఈ నియామకాలు చేపట్టినట్లు తెలుస్తోంది.

దైన్యం తొలగి.. ధైర్యం ప్రవహించె!

నాడు

టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు 2014 ఎన్నికలకు ముందు కర్నూలు జిల్లాకు హక్కుగా రావాల్సిన తుంగభద్ర జలాలను తెచ్చేందుకు తుంగభద్ర దిగువ కాలువను ఆధునికీకరణ చేస్తామని హామీ ఇచ్చారు. ఐదేళ్ల సీఎంగా పని చేసిన బాబు ఆధునికీకరణ పనులను అటకెక్కించారు. టీబీ డ్యాం నుంచి 70 కి.మీ వరకు మాత్రమే తూతూమంత్రంగా పనులు చేసి చేతులేత్తేశారు.

నేడు

వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత 70 కి.మీలోపు మిగిలిపోయిన 30 శాతం పనులను పూర్తి చేయించింది. అంతేకాకుండా మొదటి విడతలో 80 కి.మీ నుంచి 115 కి.మీ వరకు రూ.520 కోట్లు ఖర్చు చేసి పది ప్యాకేజీ పనులను పూర్తి చేసింది. రెండో విడత రూ.410 కోట్లతో 11 నుంచి 20 ప్యాకేజీల కింద 115 కి.మీ నుంచి 205 కి.మీ వరకు ఆధునికీకరణ పనులను చేసింది. ఇందులో 12,13,14 ప్యాకేజీల పనులు చేయాల్సి ఉంది. ప్రస్తుతం కాల్వకు తాగునీటి అవసరాల కోసం నీటిని విడుదల చేశారు. ఈ ప్రవాహం ఆగిన తరువాత పనులు పూర్తి చేయనున్నారు.



ఎల్లెల్సీ169- 170 కి.మీ వద్ద ఇనుప వంతెన



173.100 కి.మీ వద్ద దిగువ కాలువ



175 కి.మీ దగ్గర 51 డిస్ట్రిబ్యూటరీ

- టీడీపీ హయాంలో అటకెక్కిన ఎల్లెల్సీ ఆధునికీకరణ
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మూడు విడతలుగా పనులు
- రూ.930 కోట్లతో 20 ప్యాకేజీల్లో కాలువకు హంగులు
- మూడో విడత రూ. 420 కోట్లతో టెండర్లు ఖరారు

కర్నూలు సిటీ: తుంగభద్ర దిగువ కాలువ (ఎల్లెల్సీ) ఆధునికీకరణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇచ్చింది. నాణ్యతతో పనులు పూర్తి చేసింది. కాలువ ఆధునీకరణతో నీటి ప్రవాహం పెరిగి ఆయకట్టు రైతులు సంతోషంగా రెండు పంటలు సాగు చేసుకుంటున్నాయి. అయితే ఈనాడు దినపత్రిక ఈ పనులపై విషం కక్కింది. 173.కి.మీ దగ్గర ఇనుప కంచె కింద కాలువ కింద లైనింగ్ పోయిందని, 169-170కి.మీ దగ్గర ఇనుప వంతెన కింద కాలువలో పెచ్చులు పోయాయని, వాటికి పూతలు పూశారని, 173.100 కి.మీ దగ్గర ఎల్లెల్సీ లైనింగ్ బాగున్నా..మట్టి జారిందని రాశారు. 175 కి.మీ 51 డిస్ట్రిబ్యూటరీ పనులు చేశారు. అయితే సైడ్ వాల్ అంటూ తప్పుగా ప్రచారం చేశారు. ఇదిలా ఉండగా మూడో విడత కింద 205 కి.మీ నుంచి 250 కి.మీ వరకు ఆధునీకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం మరో పది ప్యాకేజీలుగా రూ.420 కోట్లతో అంచనాలు వేసి టెండర్లు సైతం ఖరారు చేసింది.

పెరిగిన నీటి లభ్యత

కర్ణాటక రాష్ట్రం బళ్లారి జిల్లాలోని హొస్పేట్‌కి సమీపంలోని మల్లాపురం గ్రామం దగ్గర తుంగభద్ర డ్యాం నిర్మించారు. 1957 సంవత్సరంలో ఈ ప్రాజెక్టు పూర్తి అయ్యింది. తుంగభద్ర దిగువ కాలువను 1,800 క్యూసెక్కుల సామర్థ్యంతో నిర్మించారు. మొత్తం కాలువ 324.58 కి.మీ పొడవు ఉండగా.. ఇందులో 130 కి.మీ దగ్గర కర్నూలు జిల్లాలోకి ప్రవేశిస్తుంది. ఇందులో 250.58 కి.మీ వరకు టీబీ బోర్డు పరిధిలో ఉంది. టీబీ బోర్డు పరిధిలో ఎక్కువగా జల చౌర్యం జరుగుతుండటంతో గతంలో జిల్లాకు వాటా నీరు వచ్చేది కాదు. వాటా నీరు జిల్లాకు రావాలంటే కాలువ ఆధునికీకరణ పనులు0 కి.మీ నుంచి 250.58 కి.మీ వరకు చేయాలని బెంగళూరుకు చెందిన ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్సు ప్రొఫెసర్ రాంప్రసాద్ 2016లో అప్పటి టీడీపీ ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. అయితే టీడీపీ ప్రభుత్వం ఈ పనులు చేసేందుకు సుముఖత చూపలేదు. రైతుల నుంచి నిరసనలు వెల్లువెత్తడంతో తూతూ మంత్రం పనులు చేసింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎల్లెల్సీ ఆధునికీకరణ పనులపై పూర్తి స్థాయిలో దృష్టి సారించింది. టీడీపీ హయాంలో మిగిలిపోయిన పనులు పూర్తి చేయడంతోపాటు మిగిలిన కాలువను సైతం పూర్తిస్థాయిలో ఆధునికీకరించింది. దీంతో ఏపీ సరిహద్దు దగ్గర నీటి ప్రవాహం 250 క్యూసెక్కుల నుంచి 750 క్యూసెక్కులకు పెరిగింది. కాలువ ఆధునికీకరణతో ఆయకట్టు రైతులకు నీరు సమృద్ధిగా వస్తోంది. దీంతో ఏడాదికి రెండు పంటలు పండించుకోగలిగారు.

దిగువ కాలువ కింద సాగైన ఆయకట్టు

సంవత్సరం	సాగైన ఆయకట్టు (ఎకరాల్లో)	వచ్చిన నీరు (టీఎంసీల్లో)
2014-15	66,646	15.17
2015-16	50,500	11.46
2016-17	27,000	6.1
2017-18	46,000	11.48
2018-19	18,500	13.12
2019-20	49,500	14.20
2020-21	33,381	17
2021-22	82,207	24
2022-23	73,989	17.161
2023-24	35,000	11.727

నాణ్యతకు అధిక ప్రాధాన్యత ఇచ్చాం

తుంగభద్ర దిగువ కాలువ ఆధునీకరణ పనుల్లో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చాం. కాలువలో ఎక్కడ కూడా పగుళ్లు లేవు. ఇనుప కంచె సమీపంలో ఎలాంటి పూతలు పూయలేదు. వంతెనకు సపోర్ట్‌గా కాంక్రీట్ వేశాం. కాలువలోకి గొర్రెలు నీరు తాగేందుకు వచ్చిన సమయంలో మట్టి దొర్లితే అది కూడా పనుల తప్పిదం అనేది సరైంది కాదు. ఇప్పటి వరకు రెండు విడతల్లో పనులు చేపట్టగా, మూడో విడత పనులకు టెండర్లు ఖరారు అయ్యాయి. త్వరలోనే టెండర్ దారులతో అగ్రిమెంట్ చేసుకొని పనులు మొదలు పెట్టనున్నాం.

– అమర్నాథ్ రెడ్డి, ఎల్లెల్సీ, బళ్లారి డివిజన్, డీఈఈ

కోరిక తీరిస్తే.. సెల్ కొనిస్తా!

- ఆలస్యంగా వెలుగు చూసిన టీడీపీ నాయకుని భాగోతం
- పోలీసులకు ఫిర్యాదు చేసిన మహిళ
- కేసు నమోదు, పరారీలో నిందితుడు



నంద్యాల పార్లమెంట్ టీడీపీ ఇన్‌చార్జ్ మాండ్ర శివానందరెడ్డితో ఉన్న హేమసుందర్‌రాజు (మధ్యలో కళ్లద్దాలు ఉన్న వ్యక్తి) ఫైల్

పగిడ్యాల: కోరిక తీరిస్తే సెల్ కొనిస్తానంటూ ఓ మహిళను లైంగికంగా వేధించిన టీడీపీ నాయకుని భాగోతం ఆలస్యంగా వెలుగు చూసింది. ముచ్చుమర్రి పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నంద్యాల పార్లమెంట్ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ మాండ్ర శివానందరెడ్డి ముఖ్య అనుచరుడైన నెహ్రూనగర్‌కు చెందిన హేమసుందర్‌రాజు ఈనెల 14వ తేదీన గ్రామానికి చెందిన ఓ పేద మహిళను ఇంట్లో పనిచేయడానికి రావాలని పిలిచాడు. దీంతో ఆమె ఒంటరిగా వెళ్లకుండా తన అత్త కూతురును వెంట బెట్టుకుని వెళ్లింది. ఆమె ఇంటిని శుభ్రం చేసే పనిలో నిమగ్నం కాగా ముద్దు ఇవ్వాలని చేయి పట్టుకోవడంతో పాటు కోరిక తీరిస్తే సెల్ కొనిస్తానంటూ వేధించాడు. కామాంధుని బారి నుంచి తప్పించుకున్న ఆమె జరిగిన విషయాన్ని కుటుంబీకులకు చెప్పి విలపించింది. రాజకీయ అండదండలు కలిగిన వ్యక్తి తాను చేసిన నిర్వాకాన్ని బయటకు చెబితే అంతూ చూస్తానని ఆమెను బెదిరించడంతో బయటకు చెప్పుకోలేక పోయింది. చివరకు తమకు జరిగిన అవమాన భారాన్ని తట్టుకోలేని ఆ కుటుంబీకులు గురువారం ముచ్చుమర్రి పోలీసులను ఆశ్రయించి న్యాయం చేయాలని ఫిర్యాదు చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు నిందితుడు హేమసుందర్‌రాజుపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ జయశేఖర్ వెల్లడించారు. విషయం బయటకు పొక్కడంతో నాలుగు రోజుల క్రితమే నిందితుడు హైదరాబాద్‌కు పరారైనట్లు సమాచారం. నాలుగు గోడల మధ్య టీడీపీ నాయకుడు చేసిన ఆకృత్యం వెలుగు చూడకుండా మధ్యవర్తుల చేత రాజీ ప్రయత్నం చేసినట్లు సమాచారం. పొట్ట కూటికోసం పనికి వెళ్తే లైంగికంగా వేధించిన టీడీపీ నాయకుని నిర్వాకాన్ని గ్రామ ప్రజలు తప్పుబడుతున్నారు.

వైఎస్‌ఆర్ జలకళ బోర్ల తవ్వకం పారదర్శకమే..

కర్నూలు(అగ్రికల్చర్): వైఎస్‌ఆర్ జలకళ కింద నంద్యాల జిల్లాలో వేసిన బోర్ల తవ్వకాలు పారదర్శకంగా జరిగినట్లు సామాజిక తనిఖీల ద్వారా స్పష్టమైంది. గురువారం నంద్యాల జిల్లాలో వైఎస్సార్ జలకళ బోర్ల తవ్వకాలు, కర్నూలు డబ్ల్యూసీసీ పరిధిలోని వాటర్‌షెడ్ కార్యక్రమాలపై కర్నూలు శివారు జగన్నాథ గట్టులోని జిల్లా నీటియాజమాన్య సంస్థ శిక్షణా కేంద్రంలో ఓపెన్‌ఫోరం నిర్వహించారు. కర్నూలు జిల్లా డ్వామా పీడీ అమరనాథరెడ్డి, నంద్యాల డ్వామా పీడీ రామచంద్రారెడ్డి హాజరయ్యారు. ముందుగా సామాజిక తనిఖీ బృందాల పరిశీలనలో వెలుగు చూసిన అంశాలను అధికారుల దృష్టికి తెచ్చారు. నంద్యాల జిల్లాలో మొత్తం 2,138 బోర్లు వేయగా.. 2022 జూలై 1 నుంచి 2022 ఫిబ్రవరి 22 వరకు వేసిన బోర్లలో పూర్తి పేమెంట్ అయిన వాటికి సంబంధించి సోషల్ ఆడిట్ నిర్వహించారు. మొత్తం 675 బోర్లపై సామాజిక తనిఖీలు నిర్వహించగా 5 శాతం బోర్ల తవ్వకాల లోతుల్లో తేడాలు ఉన్నట్లు గుర్తించారు. కొన్ని బోర్లలో రికార్డు చేసిన దాని కంటే 20-30 అడుగుల లోతు తక్కువగా ఉన్నట్లు వెల్లడైంది. అయితే ఓపెన్ ఫోరంకు హాజరైన రైతులు మాట్లాడుతూ తమ పొలాల్లో రికార్డు చేసిన మేరకు బోర్లు వేశారని, అయితే పూడిపోవడం వల్ల తేడాలు వచ్చాయన్నారు. అనంతరం కర్నూలు డబ్ల్యూసీసీ పరిధిలోని శకునాల, పోతుగల్ పీఎంకేఎస్‌వై వాటర్‌షెడ్ పనులపైనా ఓపెన్ ఫోరం నిర్వహించారు. రెండు ప్రాజెక్టులకు సంబంధించి రూ.65,377 రికవరీకి నిర్ణయించారు. రూ.2వేల జరిమానా విధించారు. కార్యక్రమంలో వాటర్‌షెడ్స్ అదనపు పీడీ మాధవీలత, డ్వామా విజిలెన్స్ అధికారులు పాల్గొన్నారు.



ఓపెన్ ఫోరం నిర్వహిస్తున్న కర్నూలు, నంద్యాల జిల్లాల నీటియాజమాన్య సంస్థ పీడీలు అమరనాథరెడ్డి, రామచంద్రారెడ్డి

పోలీస్ లాంఛనాలతో ఎస్‌ఐ వెంకటరమణ అంత్యక్రియలు

అనంతపురం/గార్లదిన్నె: అనంతపురం నగరానికి చెందిన ఎస్‌ఐ నంబూరి వెంకటరమణ(55) అంత్యక్రియలు గురువారం గార్లదిన్నె మండలంలోని ఆయన వ్యవసాయ క్షేత్రంలో నిర్వహించారు. నంద్యాల జిల్లా ప్యాపిలి సర్కిల్ పరిధిలోని రాచర్ల ఎస్‌ఐగా పనిచేస్తున్న ఆయన... బుధవారం మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలం అన్నాసాగర్ వద్ద 44వ జాతీయ రహదారిపై చోటు చేసుకున్న ప్రమాదంలో ఆయనతో పాటు నూతన అల్లుడు పవన్ సాయి, డ్రైవర్ చంద్రశేఖర్ మృతి చెందిన విషయం తెలిసిందే. గురువారం సాయంత్రం ఎస్‌ఐ వెంకటరమణ మృతదేహాన్ని కుటుంబసభ్యులు గార్లదిన్నె మండలం మర్తాడులో తమ వ్యవసాయ క్షేత్రానికి తీసుకువచ్చారు. మంత్రి బుగ్గన రాజేంద్రనాథరెడ్డి, నంద్యాల ఎస్పీ రఘువీరారెడ్డి, డీఎస్పీ వెంకటశివారెడ్డి పాల్గొన్నారు. వెంకటరమణ మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. అంతకు ముందు జిల్లా కేంద్రంలోని రామచంద్ర నగర్‌లో ఉన్న స్వగృహానికి చేరిన వెంకటరమణ మృతదేహాన్ని ఎస్పీ అన్బురాజన్, పోలీసు ఉన్నతాధికారులు, సహచరులు సందర్శించి అశ్రునయనాలతో నివాళులర్పించారు. పీటీసీ అదనపు ఎస్పీ జె.మల్లికార్జున వర్మ, అనంతపురం డీఎస్పీ జి.వీరరాఘవరెడ్డి, పలువురు సీఐలు, ఎస్‌ఐలు, బ్యాచ్‌మేట్లు, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడ్‌హాక్ కమిటీ సభ్యులు త్రిలోక్‌నాథ్, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మర్తాడులో ఎస్‌ఐ వెంకటరమణ అంత్యక్రియలు నిర్వహిస్తున్న దృశ్యం



ఎస్‌ఐ మృతదేహంపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళి అర్పిస్తున్న మంత్రి బుగ్గన రాజేంద్రనాథరెడ్డి

'ఆడుదాం- ఆంధ్రా'లో జిల్లా క్రీడాకారుల ప్రతిభ

- వాలీబాల్, షటిల్, కబడ్డీ క్రీడల్లో అత్యుత్తమ ప్రదర్శన
- క్రీడాకారులకు జిల్లా కలెక్టర్ అభినందన

కర్నూలు(సెంట్రల్): రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ఆడుదాం- ఆంధ్ర క్రీడా పోటీల్లో కర్నూలు జిల్లా క్రీడాకారులు ఉత్తమ ప్రతిభను కనబరిచారు. వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్, కబడ్డీ క్రీడల్లో రాష్ట్ర స్థాయిలో రెండు, మూడు స్థానాల్లో నిలిచారు. ఫిబ్రవరి 9 నుంచి 13వ తేదీ వరకు విశాఖపట్నంలో ఆడుదాం-ఆంధ్రా రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో బాలికల విభాగం వాలీబాల్‌లో రెండో స్థానం, షటిల్‌లో మూడో స్థానం, బాలుర విభాగంలో కబడ్డీలో రాష్ట్రస్థాయిలో మూడో స్థానంలో నిలిచి ట్రోఫీలు, మెడల్స్, సర్టిఫికెట్లను సాధించారు. విజేతలుగా తిరిగి వచ్చిన క్రీడాకారులు గురువారం సాయంత్రం జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజనను ఆమె కార్యాలయంలో కలిశారు. అత్యుత్తమ ప్రతిభ కనబరచిన వీరిని జిల్లా కలెక్టర్ అభినందించారు. ఇదే ఉత్సాహంతో జాతీయ స్థాయి క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి శ్రీనివాసరావు, సెట్కూరు సీఈఓ రమణ పాల్గొన్నారు.



గెలిచిన ట్రోఫీలు, మెమెంటోలు, సర్టిఫికెట్లను జిల్లా కలెక్టర్ సృజనకు అందించిన క్రీడాకారులు

సామరస్యమే శాంతియుత పరిష్కారం

కర్నూలు సిటీ: పాలస్తీనా, ఇజ్రాయిల్ దేశాల మధ్య సమస్యకు సామరస్యమే శాంతియుత పరిష్కారాన్ని చూపుతుందని వక్తలు అన్నారు. పాలస్తీనా, ఇజ్రాయిల్ దేశాల మధ్య ఎడతెగని పోరాటం- సమస్యలకు పరిష్కారం అనే అంశంపై రెండు రోజుల పాటు జరిగే అంతర్జాతీయ సదస్సు కేవీఆర్ మహిళా కళాశాల(క్లస్టర్ యూనివర్సిటీ)లో గురువారం ప్రారంభమైంది. మొదటి రోజున ముఖ్య అతిథులుగా క్లస్టర్ యూనివర్సిటీ, డాక్టర్ అబ్దుల్ హక్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్లు ఆచార్య డీవీఆర్ సాయిగోపాల్, ఆచార్య ఫజలుల్ రెహ్మాన్‌లు ప్రసంగించారు. విద్రోహక చర్యలు పాలస్తీనా, ఇజ్రాయిల్ దేశాల మధ్య సామరస్యాన్ని దెబ్బ తీస్తున్నాయన్నారు. వసుధైక కుటుంబం భావన అవసరమని పేర్కొన్నారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీవీఎస్ కుమార్ మాట్లాడుతూ.. సర్దుబాటు లేకుండా పోతే ప్రజలు అన్ని విధాలా నష్టపోతారన్నారు. ఉస్మానియా కళాశాల ప్రిన్సిపాల్ సమీయుద్దీన్ ముజమ్మిల్, ఆఫ్ఘనిస్తాన్ నుంచి వచ్చిన అలచ్రుని విశ్వవిద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్ అబ్దుల్ తమీన్ మాట్లాడుతూ.. సాంఘిక, రాజకీయ భావజాల స్వేచ్ఛ కాపాడుకునే దిశలో ప్రజలు, ప్రభుత్వాలు ఆలోచిస్తే అంతర్యుద్ధాలు ఉండబోవన్నారు. లెసతో అనే దేశం నుంచి వచ్చిన గ్రేస్ లోసాని మాట్లాడుతూ.. ప్రపంచ దేశాలు మానవీయ కోణంలో శాంతిని కాంక్షించాలన్నారు. సైకాలజిస్ట్ జ్యోతిర్మయి, డాక్టర్ అక్తర్ భాను, డాక్టర్ దేవి కారాణి, డాక్టర్ సునీత, డాక్టర్ పార్వతి, డాక్టర్ జై సుశీల, డాక్టర్ రాధారమణి, డాక్టర్ జయలక్ష్మి, డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ ఆరతి చక్ర, డాక్టర్ వేదవతి, డాక్టర్ లత, డాక్టర్ హవీలా, డాక్టర్ నజీరుద్దీన్, డాక్టర్ ఖాజామొద్దీన్, డాక్టర్ నజాయతుల్లా, డాక్టర్ నజీర్ అహ్మద్, డాక్టర్ జి.మహబూబ్ బాషా, డాక్టర్ ఎస్.మహబూబ్ బాషా, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలనతో సదస్సును ప్రారంభిస్తున్న క్లస్టర్ వర్సిటీ వీసీ డీవీఆర్ సాయిగోపాల్

ఎద్దుల బండి బోల్తా.. వ్యవసాయ కూలీ మృతి

పత్తికొండ రూరల్ : మండల పరిధిలోని పెద్దహుల్తి గ్రామంలో పొలానికి వెళ్తున్న ఎడ్లబండి బోల్తా పడి వ్యవసాయ కూలీ నడిమింటి క్రిష్ణ(38) గురువారం మృతి చెందాడు. వివరాలు.. పొలం పనులు చేసేందుకు భార్య రామేశ్వరి, చిన్నమ్మ రామాంజినమ్మ, కుమారుడు శ్రీశాంత్‌తో కలిసి నడిమింటి క్రిష్ణ ఎద్దుల బండిపై వెళ్తుండగా వాగు వద్ద అదుపు తప్పి బోల్తా పడింది. గమనించిన చుట్టుపక్కల రైతులు గాయపడిన క్రిష్ణ, కుటుంబ సభ్యులను చికిత్స నిమిత్తం పత్తికొండ ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా కోలుకోలేక క్రిష్ణ మృతిచెందాడు. మృతుడి భార్య రామేశ్వరి స్వల్పంగా గాయపడ్డారు. మిగిలిన ఇద్దరూ క్షేమంగా బయటపడ్డారు. మృతుడికి ముగ్గురు కుమారులు సంతానం.



క్రిష్ణ మృతదేహంపై పడి రోదిస్తున్న భార్య

మద్దతు ఇవ్వలేదు..
కబ్జా నుంచి కాపాడారు!

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు మండలంలోని కొట్టాలచెర్వు గ్రామంలో ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసేందుకు వైఎస్సార్‌సీపీ నాయకులు మద్దతు ఇవ్వలేదు. కబ్జా నుంచి స్థలాన్ని కాపాడారు. అయితే ఈనాడు దినపత్రికలో అందుకు విరుద్ధంగా గురువారం వార్త ప్రచురితం కావడంపై అధికార పార్టీనాయకులు మండిపడుతున్నారు. కొట్టాలచెర్వు గ్రామంలో చెంచులకు నూతన పాఠశాల, వసతి గృహ నిర్మాణం కోసం రూ.2.30 కోట్లు మంజూరు కాగా.. స్థల సేకరణ కోసం గ్రామంలో ప్రభుత్వ స్థలాలను పరిశీలించారు. అందుకు అనువైన 12 సెంట్ల స్థలాన్ని తులసీబాయి అనే మహిళ అప్పటికే ఆక్రమించుకుని పశుగ్రాసం, పశువుల షెడ్ వేసుకుని ఉంది. ఇదే విషయాన్ని గ్రామ సర్పంచ్ నాగలక్ష్మమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు జెడ్డా దేవదానం, రమణ, చిన్నా తదితరులు తహసీల్దార్ బాబుకు తెలిపారు. కబ్జా నుంచి ఆ స్థలాన్ని విడిపించి, వసతి గృహం నిర్మాణానికి కేటాయించాలని కోరారు. వారి విన్నపం మేరకు తహసీల్దార్ బాబు, ఎస్‌ఐ నారాయణరెడ్డి గ్రామానికి వచ్చి స్థల పరిశీలన జరిపారు. తులసీబాయి ఆ స్థలానికి సంబంధించి తనకు హక్కులున్నాయని రికార్డులు చూపగా అవి చెల్లవని తెలిపిన అధికారులు తదుపరి చర్యల కోసం నోటీసులు ఇచ్చారు.

వేసవిలో నీటి ఎద్దడి తలెత్తనివ్వం

- రూ.14.98 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు
- 'వాటర్ ఆడిట్' ప్రకారం నీటి సరఫరాకు చర్యలు
- జల సంఘాల ఆధ్వర్యంలో జేజేఎం పనులు
- మరోసారి ఎస్‌ఎస్ ట్యాంకులు నింపుకునేందుకు ప్రయత్నం
- 'సాక్షి'తో ఆర్‌డబ్ల్యూఎస్ పర్యవేక్షక ఇంజినీరు బీ నాగేశ్వరరావు



కర్నూలు(అర్బన్): వచ్చే వేసవిలో ఎక్కడా తాగునీటి సమస్య ఉత్పన్నం కాకుండా చర్యలు చేపడుతున్నామని జిల్లా గ్రామీణ నీటి సరఫరా విభాగం పర్యవేక్షక ఇంజనీరు బీ నాగేశ్వరరావు తెలిపారు. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులతో కొంత మేర తాగునీటి సమస్య తలెత్తే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ప్రత్యామ్నాయంగా ఎలాంటి చర్యలు చేపట్టాలో.. ఎంత మేర నిధులు అవసరమవుతాయో.. ఇప్పటికే ఒక అంచనాకు వచ్చామని తెలిపారు. ఒక గ్రామానికి నీటి డిమాండ్ ఎంత ఉంది.. ప్రస్తుతం ఎంత సరఫరా చేస్తున్నాం .. అనే వివరాలకు సంబంధించి ' వాటర్ ఆడిట్ ' నిర్వహించి అవసరమైన చర్యలు చేపడతామని పేర్కొన్నారు. జిల్లాలో ఎక్కడ నీటి సమస్య ఉన్నా, తమకు తెలియజేసేందుకు ప్రత్యేకంగా సెల్ ఏర్పాటు చేశామని చెప్పారు. గురువారం ఆయన ' సాక్షి 'తో ముఖాముఖి మాట్లాడారు. ఆ వివరాలు యథతథంగా..

ప్రశ్న: జిల్లాలో ప్రస్తుతం తాగునీటి సమస్య ఎలా ఉంది? వేసవిలో తాగునీటి ఇబ్బందులను ఎలా ఎదుర్కొంటారు?

జవాబు: ఇప్పటి వరకు చాలా తక్కువ జనవాసాల్లో నీటి సమస్య ఉన్నట్లు మా దృష్టికి వచ్చింది. రానున్న మార్చి, ఏప్రిల్, మే, జూన్ నెలల్లో 169 జనవాసాల్లో నీటి ఎద్దడి ఉంటుందని అంచనాకు వచ్చాం.

ప్ర: నీటి ఎద్దడి తలెత్తే జనవాసాల్లో ఎలాంటి చర్యలు చేపట్టనున్నారు ?

జ: నీటి ఎద్దడి తలెత్తనున్న జనవాసాల్లో వేసవిలో నీటి సమస్యను అధిగమించేందుకు పలు కార్యక్రమాలు చేపట్టేందుకు రూ.14.98 కోట్లు అవసరమవుతాయని జిల్లా కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం.

ప్ర: ఎలాంటి కార్యక్రమాలు చేపట్టనున్నారు ?

జ: ముందుగా ఆయా ప్రాంతాల్లోని బోర్లలో డీపెనింగ్, ఫ్లష్షింగ్ పనులు చేపడతాం. అలాగే సమీపంలోని నీటి వనరులను గుర్తించి హైరింగ్ ద్వారా నీటిని అందిస్తాం. జిల్లా కలెక్టర్ ద్వారా ఎల్‌ఎల్‌సీ, హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ ద్వారా ఎస్‌ఎస్ ట్యాంకులను నింపుకునేందుకు ప్రయత్నిస్తాం. అప్పటికి సమస్య పరిష్కారం కాకుంటే ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తాం.

ప్ర: జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో ఇప్పటికే నీటి సమస్య ఉత్పన్నమైంది కదా ?

జ : అందుకే గత ఏడాది నవంబర్‌లో తుంగభద్ర దిగువ కాలువకు నీరు బంద్ అయ్యే సమయంలో ఎల్‌ఎల్‌సీ పరిధిలోని ఎస్‌ఎస్ ట్యాంకులన్నింటిని నింపుకున్నాం. ఆయా ఎస్‌ఎస్ ట్యాంకుల్లో నేటికి నీటి నిల్వలు ఉన్నాయి. అలాగే జీడీపీలో 2 టీఎంసీల నీటిని నిల్వ చేయడం వల్ల హంద్రీ పరివాహక ప్రాంతాల్లో కూడా నీటి సమస్యను తీరుస్తున్నాం.

ప్ర: జిల్లాలో చేతి పంపుల పరిస్థితి ఎలా ఉంది ?

జ: జిల్లాలో మొత్తం 4,698 చేతి పంపులు ఉండగా, ఇప్పటి వరకు 3,446 పనిచేస్తున్నాయి. మిగిలిన వాటిలో కొన్నింటిలో నీరు లేదు. మరికొన్ని పూర్తిగా పాడైపోయాయి. ఎక్కడ చిన్న అవకాశం ఉన్నా, చేతి పంపులను బాగు చేస్తున్నాం. బోర్ల మరమ్మతులకు గ్రామ పంచాయతీ, మండల పరిషత్తుల్లో 15వ ఆర్థిక సంఘం నిధులు ఉన్నాయి.

ప్ర: ప్రజల అవసరాల మేరకు నీటిని అందించగలుగుతున్నారా ?

జ : ప్రతి మనిషికి రోజుకు 55 లీటర్ల నీటిని అందించాల్సి ఉంది. ఇందులో తాగేందుకు 3 లీటర్లు, వంటకు 5 లీటర్ల ప్రకారం అందించాల్సి ఉంది. తాగునీటితో పాటు వంటకు అవసరమయ్యే 8 లీటర్లకు బదులు 15 లీటర్లను అందించేందుకు చర్యలు చేపడుతున్నాం.

ప్ర: ఇంటింటికీ కుళాయి పనులు ఎంత వరకు వచ్చాయి ?

జ: జల జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ కుళాయి ఏర్పాటు చేసే పనులు జరుగుతున్నాయి. రూ.500 కోట్లతో చేపట్టిన ఈ పనులు ఇప్పటికే 40 శాతం పూర్తి అయ్యాయి. ఈ పనుల్లో భాగంగానే 442 గ్రామాల్లో రూ.68.27 కోట్లు, 177 వైఎస్సార్ జగనన్న కాలనీల్లో రూ.18.62 కోట్లతో గ్రామ జల సంఘాలు పనులు చేపడుతున్నాయి.

> **ప్ర:** గ్రామాల్లో సమస్య వస్తే ఎవరికి చెప్పుకోవాలి?
>
> **జ:** జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కడ తాగునీటి సమస్య ఎదురైనా వెంటనే మా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సెల్: 9652535483, 9618542989 నంబర్లకు సమాచారం అందించాలి. ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ నంబర్లు ప్రజలకు అందుబాటులో ఉంటాయి.